1St Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు


ప్రతి వార్త వెలుగు వైపు   తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health   Best for Readers   THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 124   సోమవారం 11 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నిలిపివేద్దాం

### ప్రధాని మోదీ పిలుపు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 10)

కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో సమస్యలు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ (ప్రావీ వీశీఎఱ) అన్నారు. యుద్ధాలతో పొరుగుదేశాల్లో చమురు ధరలు పెరిగాయని, కానీ, ఆ ధరల భారాన్ని దేశ ప్రజలపై పడకుండా చూశామని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులతో బంగారం (+శీశ్రీఎ) ధరలు పెరుగుతున్నాయని.. ఏడాది పాటు కొనుగోళ్లను నిలిపివేద్దామని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన భాజపా బహిరంగ సభలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

"దేశంలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ సమస్యలను వివిధ దేశాలతో మాట్లాడి అధిగమిస్తాం. దీర్ఘకాలంలో చమురు వినియోగాన్ని మనం తగ్గించుకోవాలి. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. రైల్వే రంగంలో డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాం. సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ అవసరం మనకు భారీగా తగ్గుతుంది. చమురు వాడకం తగ్గితే.. విదేశీ మారక ద్రవ్యం మిగులుతుంది. పండుగలు, శుభకార్యాలకు బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలి. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు నిలిపేద్దాం. బంగారం దిగుమతులు తగ్గితే.. విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుంది. చాలా దేశాల్లో యూరియా బస్తా ధర రూ.3 వేలు ఉంది. భారత్‌లో రూ.300లోపే ఉంది" అని మోదీ అన్నారు.




## 'విజయ్ అనే నేను..'

### తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా దళపతి ప్రమాణ స్వీకారం

(షణ్ముఖ వెలుగు, తమిళనాడు,మే 10)

తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇందుకు చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికైంది. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, -మిగతా ▶2లో






## తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం..

దాదాపు 59 ఏళ్ల తర్వాత ద్రావిడేతర సీఎంగా బాధ్యతలు
తొలిసారే 108 స్థానాలు గెలిచిన తమిళగ వెట్రి కళగం పార్టీ
ప్రమాణ స్వీకారానికి హాజరైన రాహుల్ గాంధీ, ఇతర రాజకీయ నేతలు
కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు

▶2లో

## బెంగాల్ పీఠంపై సువేందు

అట్టహాసంగా రాష్ట్ర తొలి భాజపా సీఎం ప్రమాణం
మంత్రులుగా మరో ఐదుగురు ఎమ్మెల్యేలు...



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, మే 10)

ఒకప్పుడు వామపక్షాలు, నిన్నటి వరకూ మమతా బెనర్జీ కంచుకోటగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో శనివారం అధికార మార్పిడి సాఫీగా సాగిపోయింది. భాజపా నేత సువేందు అధికారి నేతృత్వంలో శనివారం నూతన సర్కారు కొలువుదీరింది. -మిగతా ▶2లో

## మా ఇంటికి వచ్చి ప్రధాని చూపిన ఆప్యాయత మరువలేనిది

- ▶హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి ప్రధాని మోదీ
- ▶గంటకు పైగా సీఎం నివాసంలో గడిపిన ప్రధాని
- ▶ఇది తమ కుటుంబానికి చిరస్మరణీయ సాయంత్రమన్న చంద్రబాబు
- ▶ప్రధాని ఆప్యాయత, ప్రోత్సాహం మరువలేనిదన్న సీఎం
- ▶చంద్రబాబు నివాసంలోని సీతారాములకు మోదీ పూజలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 10)



ప్రధాని నరేంద్ర మోదీ తమ నివాసానికి రావడం తన కుటుంబానికి ఎంతో ప్రత్యేకమైన, చిరస్మరణీయమైన సాయంత్రమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని మోదీ చూపిన ఆప్యాయత, కుటుంబ సభ్యులతో ఆయన కలివిడిగా మాట్లాడిన తీరు ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆత్మీయ పర్యటనకు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహానికి ప్రధానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు."ఈ సాయంత్రం

## నేడు సింగపూర్‌లో మంత్రి నారా లోకేష్ పర్యటన...



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 10)

ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సోమవారం (మే 11) నాడు ఆయన సింగపూర్ లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు ఎంటీఐ కార్యాలయంలో జరిగే జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో లోకేష్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం సింగపూర్‌లోని సన్ టెక్ సిటీలో వరుస భేటీలు జరపనున్నారు.

మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2:30 గంటల వరకు కమోడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సీఐసీ) సీఈవో, సీఎఫ్ఓలతో సమావేశమవుతారు. ఆ తర్వాత 2:30 నుంచి 3 గంటల వరకు డీపీ ఆర్కిటెక్ట్స్ సంస్థ ప్రతినిధులతో లోకేష్ భేటీ అవుతారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

## మోదీ ఆశీస్సులు, మార్గదర్శనం నాకు ఎప్పటికీ ప్రత్యేకం

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 10)

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన సతీమణి అన్నా కొణిదాల, పిల్లలు అకీరానందన్, ఆద్య, పోలినా అంజని, మార్క్ శంకర్‌లతో కలిసి ప్రధానికి ఆత్మీయ స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ప్రధాని మోదీ తన నివాసానికి రావడం ఆయనలోని ఆప్యాయత, మానవతా దృక్పథానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ తెలిపారు. -మిగతా ▶2లో



## అంబేద్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

అంబేద్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను ఏపీఐఐసి వరికూటి గోపికృష్ణ, మద్దిపాడు ఎంఈఓ ఎం శ్రీనివాసరావులు ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గెలుపు ఓటమిలో సహజమని అన్నారు. ముందుగా ముఖ్య అతిథులతో క్రీడాకారులకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ కమిటీ సభ్యులు కే మనోహర్, జె అశోక్, ఎల్ నవదీప్, జె కిరణ్, ఎం ప్రవీణ్, ఎం దినేష్, టి ప్రభుదాస్, ఎం విష్ణు, ఎం భాను, సిహెచ్ విక్రాంత్, ఎం అజయ్‌చంద్ర, ఎం అజయ్, ఎం అనిల్, డి శ్యామ్, డి సన్నీ, వై ప్రసన్న, పి లివింగ్ స్టోన్, తదితరులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### జిల్లా కలెక్టర్ పి రాజబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రజలు మార్పును గమనించాలని కోరారు. ప్రజలు నిర్దేశించిన సమయానికి కార్యక్రమానికి చేరుకొని వారి వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

## పిజిఆర్ఎస్‌ను వినియోగించుకోండి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 10)

మార్కాపురం కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసుకొని అధికారులకు అందజేయాలన్నారు. అదే విధంగా 1100 నెంబర్‌కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతో పాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే అర్జీదారులు వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మొదటిపేజీ తరువాయి

## 'విజయ్ అనే నేను..'

ఇతర రాజకీయ, సినీరంగ ప్రముఖులు హాజరయ్యారు. నటి త్రిష వేదిక వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విజయ్‌తో పాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎన్. ఆనంద్, ఆదవ అర్జున, కె.ఎ. సెంగోటియన్, ఎస్ కీర్తన, కె.జి. అరుణ్ రాజ్, పి. వెంకటరమణన్, సి.ఆర్. నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, టి.కె. ప్రభు ఉన్నారు. కార్యక్రమానికి భాజపా నేతలు నైనార్ నాగేంద్రన్, కె.అన్నామలై హాజరయ్యారు.

మే 4వ తేదీన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడగా.. టీవీకే అతిపెద్దపార్టీగా అవతరించిన సంగతి తెలిసిందే. మెజార్టీ మార్క్‌కు 10 సీట్ల దూరంలో నిలవడంతో కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల మద్దతు అవసరమైంది. ఈ మద్దతు కూడగట్టుకునే క్రమంలోనే ప్రమాణస్వీకారానికి కాస్త ఆలస్యమైంది. అంతకు ముందు బ్లాక్ అండ్ వైట్ ఫార్మల్ దుస్తుల్లో వేదికవద్దకు వచ్చిన విజయ్.. ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు వాటిపై బ్లాక్ బ్లేజర్ ధరించి ఆకట్టుకున్నారు.

## తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం..

(షణ్ముఖ వెలుగు, తమిళనాడు,మే 10)

తమిళనాడు రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయం మొదలైంది. సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ ఉదయం 10 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, విజయ్‌తో ప్రమాణం చేయించారు. ఈ చారిత్రక ఘట్టంతో, దాదాపు 59 సంవత్సరాల తర్వాత తమిళనాడుకు ఒక ద్రావిడేతర ముఖ్యమంత్రి లభించినట్లయింది.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, పార్టీ నేత తమిళిసై సౌందరరాజన్‌తో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. విజయ్ తల్లిదండ్రులు ఎస్.ఏ. చంద్రశేఖర్, శోభా చంద్రశేఖర్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు, తన మంత్రివర్గ సహచరులను విజయ్ గవర్నర్‌కు పరిచయం చేశారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ, బరిలోకి దిగిన తొలిసారే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ వంటి మిత్రపక్షాల మద్దతుతో, 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో 120 మంది ఎమ్మెల్యేల బలంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు.

## మా ఇంటికి వచ్చి ప్రధాని చూపిన ఆప్యాయత మరువలేనిది

మా కుటుంబం ఎప్పటికీ గుర్తుంచుకోదగిన ఒక మధురానుభూతిని మిగిల్చింది. గౌరవ నీయులైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి ఈరోజు మా నివాసంలో ఆతిథ్యం ఇవ్వడం ఒక గౌరవంగా, ఆనందంగా భావిస్తున్నాను. ఆయన చూపిన ఆత్మీయత, ఆప్యాయత, మాతో ఎంతో ఉదారంగా సంభాషించిన తీరు ఈ సందర్భాన్ని మా అందరికీ ఎంతో ప్రత్యేకంగా మార్చాయి. ఆయనతో గడిపిన ప్రతి క్షణం మాకు చాలా విలువైంది.

మా ఆహ్వానాన్ని మన్నించి, ఎంతో దయతో మా నివాసానికి వచ్చినందుకు గౌరవనీయ ప్రధానమంత్రికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఆయన అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి, మద్దతుకు కూడా ధన్యవాదాలు" అంటూ చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు ప్రధానికి సాదరంగా స్వాగతం పలికారు. సుమారు గంటా పది నిమిషాల పాటు చంద్రబాబు నివాసంలో గడిపిన మోదీ, అక్కడి సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెస్ లో విశేషంగా రాణిస్తున్న నారా లోకేష్ తనయుడు దేవాన్ష్ ను అభినందించారు. అనంతరం, చంద్రబాబుతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ప్రధాని తమ ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించడంపై చంద్రబాబు కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.

## బెంగాల్ పీఠంపై సువేందు

బెంగాల్ 9వ ముఖ్యమంత్రిగా, రాష్ట్రంలో భాజపా తొలి సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. కోల్‌కతాలోని చారిత్రక బ్రిగేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి నూతన ముఖ్యమంత్రితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు పాల్గొన్నారు. 1971 తర్వాత కోల్‌కతాయేతర జిల్లా నుంచి సీఎం పదవి చేపట్టిన మొదటి వ్యక్తిగా సువేందు నిలిచారు. మంత్రులుగా దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, అశోక్ కీర్తనియా, నితీశ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ ప్రమాణం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో సోనార్ బంగ్లా యుగానికి అధికారికంగా శ్రీకారం చుట్టామని ప్రమాణ స్వీకారానికి ముందు సువేందు అధికారి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఒకే వాహనంలో మోదీ, సువేందు..: ప్రమాణ స్వీకారానికి ముందు ప్రధాని మోదీ, సువేందు అధికారి ఒకే వాహనంలో వేదికవద్దకు వచ్చారు. నినాదాలతో హోరెత్తిస్తున్న ఎన్డీయే మద్దతుదారులకు అభివాదం చేస్తూ ఇద్దరూ ముందుకు సాగారు. వేదిక వద్ద రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి మోదీ నివాళు లర్పించారు. వేదికపైకి వచ్చిన ప్రధాని ప్రజలకు ప్రణామం చేశారు. సువేందు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రజలకు నమస్కరిస్తున్న ప్రధాని. వేదికపై రాజ్‌నాథ్, అమిత్ షా, చంద్రబాబు తదితరులుబెంగాల్‌లో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుండటంతో రాష్ట్ర భాజపా సీనియర్ నేతల్లో ఒకరైన 98 ఏళ్ల మఖన్‌లాల్ సర్కార్‌ను కమల దళం ప్రత్యేకంగా ఆహ్వానించింది. వేదికపై ఆయనకు శాలువా కప్పి సత్కరించిన ప్రధాని మోదీ అనంతరం పాదాలకు నమస్కరించారు.

సీఎం సలహాదారుగా ఈసీ ప్రత్యేక పరిశీలకుడు: విశ్రాంత ఐఏఎస్ అధికారి సుబ్రతా గుప్తా శనివారం బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు సలహాదారుగా నియమితులయ్యారు. ఇటీవల ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తు సమయంలో ప్రత్యేక పరిశీలకుడి బాధ్యతలను సుబ్రతా గుప్తాకు ఎన్నికల సంఘం అప్పగించింది.

## మోదీ ఆశీస్సులు, మార్గదర్శనం నాకు ఎప్పటికీ ప్రత్యేకం







# మోదీకి వెంకటగిరి జామ్దానీ శ్రీవారి చిత్రం... బలపడుతున్న నమో-నారా బంధం!

రాజకీయ బంధంతో పాటు బలపడుతున్న కుటుంబ అనుబంధం

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబం అరుదైన, ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి తమ కుటుంబం తరఫున ఒక విశిష్టమైన బహుమతిని అందించారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కళావైభవానికి ప్రతీకగా నిలిచే వెంకటగిరి జామ్దానీ నేతతో ప్రత్యేకంగా రూపొందించిన శ్రీవారి చిత్రపటాన్ని కానుకగా సమర్పించారు. తిరుమల శ్రీవారిని కీర్తించే శ్లోకంతో పాటు నేసిన ఈ చిత్రపటం రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు అద్దం పట్టేలా ఉంది. తమ ఇంటికి వచ్చిన విశిష్ట అతిథికి ఏపీ సంప్రదాయాన్ని ప్రతిబింబించే కానుకను అందించి చంద్రబాబు కుటుంబం తమ గౌరవాన్ని చాటుకుంది. తన అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోదీ, తన బిజీ షెడ్యూల్‌లోనూ చంద్రబాబు కుటుంబానికి ప్రత్యేకంగా గంటకు పైగా సమయం కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా వారికి ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ వంటకాలతో తేనీటి విందు ఇచ్చారు. ఈ భేటీలో ప్రధాని మోదీ, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఆప్యాయంగా పలకరించారు. వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం మరోసారి స్పష్టంగా కనిపించింది. ఇది కేవలం టీడీపీ-బీజేపీ రాజకీయ బంధం మాత్రమే కాదని, ప్రధాని మోదీకి, నారా కుటుంబానికి మధ్య బలమైన వ్యక్తిగత అనుబంధం ఉందని ఈ సంఘటన నిరూపిస్తోందని టీడీపీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రధాని మోదీ, నారా లోకేష్ మధ్య మొదటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో అనేక సందర్భాల్లో లోకేష్ పనితీరును, నాయకత్వ లక్షణాలను ప్రధాని బహిరంగంగానే ప్రశంసించారు. ఎన్నికల సమయంలో కూటమి సభల నిర్వహణ బాధ్యతలను లోకేష్ సమర్థంగా నిర్వర్తించడాన్ని మోదీ గుర్తించి అభినందించారు. అంతకుముందు కూడా విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను విజయవంతం చేసినందుకు లోకేష్‌ను కొనియాడారు. "గతసారి చూసినప్పటి కంటే బరువు తగ్గావు లోకేష్" అంటూ ఒక సభలో ప్రధాని వ్యాఖ్యానించడం వారి మధ్య ఉన్న చనువుకు నిదర్శనం. ఈ అనుబంధంతోనే గతంలో నారా లోకేష్‌ను కుటుంబసమేతంగా ఢిల్లీలోని తన నివాసానికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో దాదాపు రెండు గంటల పాటు గడిపారు.

హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ఆతిథ్యం
వెంకటగిరి జామ్దానీ నేతతో నేసిన శ్రీవారి చిత్రాన్ని బహూకరించిన సీఎం కుటుంబం
మంత్రి నారా లోకేష్‌ను ఆప్యాయంగా పలకరించిన ప్రధాని
గంటకు పైగా చంద్రబాబు కుటుంబ సభ్యులతో గడిపిన నరేంద్ర మోదీ







ఆ భేటీలో దేవాన్ష్‌ను ఒడిలో కూర్చోబెట్టుకుని ప్రధాని ఆప్యాయంగా మాట్లాడారు. లోకేష్ తన పాదయాత్ర విశేషాలతో రూపొందించిన 'యువగళం' కాఫీ టేబుల్ బుక్‌ను ప్రధాని చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. తాను గురువుగా భావించే మోదీ మార్గదర్శకత్వంలోనే ముందుకు సాగుతానని లోకేష్ పలు సందర్భాల్లో చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో 'డబుల్ ఇంజన్ సర్కార్' వేగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఈ బంధం కీలకంగా మారుతోంది.





షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

11.05.26    సోమవారం


# రెవిన్యూ "భూ"మాయ



Adangal Report

| జిల్లా: Markapuram , మార్కాపురం | | | | మండలం: KANIGIRI , కనిగిరి | | | | గ్రామం: SANKAVARAM , సనకవరం | | | | Survey No:: 634-a | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | సర్వే నెం | పూర్తి విస్తీర్ణం | సాగుకు పనికి రాని విస్తీర్ణం | సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం | భూమి స్వభావం | శిస్తు (రూ.) | భూమి వివరణ | జల ధారము | ఆయకట్టు విస్తీర్ణం | ఖాతా నెంబరు | పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) | అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు) | అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) | అనుభవ స్వభావం | రిమార్కులు |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 1 | 634-a | 2.1800 | 2.1800 | 0.0000 | ప్రభుత్వ భూమి | 0.00 | మెట్ట | లేదు | 0.0000 | 20001301 | డొంక (డొంక) | డొంక (డొంక) | 2.1800 | | ప్రభుత్వ భూమి |

కనిగిరిలో
రూ.5 కోట్ల ప్రభుత్వ స్థలం హాంఫట్
డొంక భూమికి పొజిషన్ సర్టిఫికేట్లు
ఇచ్చిన తహశీల్దార్
కొద్ది మంది జర్నలిస్టులకు తహశీల్దార్ ఎర
ఆక్రమణలు అడ్డుకోమంటున్న ఎమ్మెల్యే
అవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్న తహశీల్దార్
తహశీల్దార్ రూటే....సప"రేటు"
భూ ఆమ్రకణ ల పై చంద్రబాబు, లోకేష్ లకు
ఫిర్యాదు చేసిన రైతులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 10)

కనిగిరిలో రెవిన్యూ అధికారులు బరితెగిస్తున్నారు... ఇద్దరు తహశీల్దార్ల పై కూటమి ప్రభుత్వం వేటు వేసినా ప్రస్తుత తహశీల్దార్ కూడా అవినీతి, అక్రమాల్లో తగ్గేదేలే....అంటున్నట్లుగా వ్యవహరిస్తున్నారు... రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ డొంక పోరంబోకు భూమిని అనర్హులకు అప్పనంగా కట్టబెట్టింది. కోట్ల రూపాయల భూ వ్యాపారానికి ఆమె తెరలేపారు. వాగులు, వంకలు, డొంక భూములను ఆక్రమణల నుండి తొలగించాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంటున్నా కనిగిరి రెవిన్యూ అధికారులు మాత్రం ఆయన మాటలను ఆలకించడం లేదనే విమర్శలున్నాయి. విలువైన ప్రభుత్వ భూమిని అనర్హులకు ఇస్తూ కనిగిరి రెవిన్యూ అధికారులు అవినీతి, అక్రమాల్లో అగ్రస్థానంలో నిలిచారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుత తహశీల్దార్ వ్యవహారశైలి కనిగిరిలో చర్చనీయాంశమైంది. కనిగిరి–పామూరు రోడ్డులో భూములకు ప్రస్తుతం హైదరాబాద్‌ను మించి ధరలు పలుకుతున్నాయి. దాంతో పామూరు హైవే రోడ్డులోని సర్వే నెం. 634/ఏ లోని 2.18 ఎకరాల డొంక పోరంబోకు భూమి పై తహశీల్దార్ కన్ను పడింది. ఆ భూమిని అక్రమంగా అనర్హులకు పట్టాలిచ్చి సొమ్ము చేసుకునేందుకు ప్రణాళిక రచించింది. అందులో భాగంగా తహశీల్దార్ అడుగలకు మడుగులు వత్తే కొందరు విలేకరులకు పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చింది. ఆ పొజిషన్ సర్టిఫికేట్లను ఓ విలేకరికి ఇవ్వడంతో అతను మిగతా విలేకరుల ఇళ్ళకు వెళ్ళి పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చి దీని విలువ రూ.10 లక్షలు అని, తహశీల్దార్ మనకెంతో మేలు చేసిందని కొందరు విలేకరులను నమ్మబలికాడు. ఇక నుంచి తహశీల్దార్ అక్రమాలను వెలుగులోకి తేవద్దని ఆ విలేకరి వారికి చెప్పడం గమనార్హం. అయితే ఆ డొంక పోరంబోకు భూమిని 60 సంవత్సరాలుగా మాచవరం కు చెందిన బిసి రైతు సాగు చేసుకుంటున్నాడు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ భూమి పై వైసీపీ నాయకుల కన్ను పడింది. ఆ రైతును బెదిరించి సాగును అడ్డుకున్నారు. ఆ భూమిని తాజా, మాజీ కౌన్సిలర్ భర్తకు అనధికారికంగా విక్రయించారు. అతను ఫ్లాట్లు వేసి అమ్మకాలు చేశారు. ఈ ప్రభుత్వ భూముల్లో ఫ్లాట్లు వేసి పేదలను మోసం చేస్తున్నారని అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ అప్పటి పాలకులు అధికార బలం ఉపయోగించి డొంక భూమిలోని ఫ్లాట్లలో కట్టడాలు కూడా జరిపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్యాక్రాంతమైన డొంక భూమిలోని కట్టడాలను మున్సిపల్ అధికారులతో తొలగించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకి దగ్గరగా హైవే 565 కు రోడ్డు ఫేసింగ్‌లో ఈ డొంక భూమి ఉండడంతో ఆ భూమి ప్రయివేటు రేట్ల ప్రకారం రూ.5 కోట్ల వరకు ఉంటుంది. విలువైన భూమి కావడంతో తహశీల్దార్ కొద్ది మంది విలేకరులతో కుమ్మక్కై గతంలో అర్బన్ కాలనీలోని సర్వే నెం.201/సి లో ఇంటి పట్టాలు పొందిన వారికే పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వడం పై తహశీల్దార్ అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాగులు, వంకలకు పట్టాలివ్వకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నా డొంక భూమికి పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వడం కనిగిరి తహశీల్దార్‌కే చెల్లిందని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కనిగిరి రెవిన్యూ డివిజన్ కావడంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటికి ఈ స్థలం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ తహశీల్దార్ మాత్రం డొంక భూమికి పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చి రూ.50 లక్షల అవినీతికి పాల్పడినట్లు ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**విలేకరులు....రైతుల మధ్య వివాదం**

తహశీల్దార్ 634/ఏ డొంక భూమికి పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వడంతో కొందరు జర్నలిస్టులు ఆ భూమిలోకి వెళ్ళారు. ఆ భూమి 60 ఏళ్ళుగా మా సాగులో ఉందని రైతులు విలేకరులను అడ్డుకున్నారు. అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడే పరిస్థితి కలగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అప్పుడు పోలీసుల సమక్షంలో విలేకరులను మీకు పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చి ఉంటే చూపండని రైతులు నిలదీశారు. ఏ ఒక్క విలేకరి కూడా పొజిషన్ సర్టిఫికేట్లు చూపే సాహసం చేయకపోవడం గమనార్హం. ఒకే విలేకరికి మున్సిపాల్టీ పరిధిలో ఎన్ని పట్టాలు ఇస్తారని పోలీసుల సమక్షంలోనే రైతులు వాగ్వివాదానికి దిగడం విస్మయాన్ని కల్గించింది.

**ఆక్రమణలు అడ్డుకోమన్నా పట్టించుకోని అధికారులు.....**

ఇటీవల ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి పెద్దచెరువును పరిశీలించారు. మున్సిపాల్టీ పరిధిలో వాగులు, వంకలు, డొంకలు ఆక్రమణలకు గురై ఉంటే అటువంటి ఆక్రమణలను తొలగించాలని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కానీ అవేమి పట్టించుకోని తహశీల్దార్ డొంక భూమిని అక్రమార్కులకు కట్టబెట్టడం ఎంత వరకు సబబు అని కనిగిరి మున్సిపాల్టీ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**పాఠశాలకు ఈ స్థలం అవసరం....**

రైతులు, విలేకరులు డొంక స్థలం విషయంలో వాగ్వివాదం చేసుకుంటున్న తరుణంలో మాచవరం కు చెందిన విద్యావంతులు ఈ డొంక స్థలాన్ని పాఠశాలకు కేటాయించాల్సిన



అవసరం ఎంతైనా ఉందని, ఆ విధంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతే గాక రూ.5కోట్ల విలువ చేసే ఈ భూమి పై దళారుల కన్ను ఉండడంతో ఈ భూ కుంభకోణం పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు కూడా స్థానికులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఈ భూమిని 60 ఏళ్ళుగా సాగు చేసుకుంటున్న మాచవరం రైతు హైకోర్టు ను ఆశ్రయించినట్లు కనిగిరిలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా డొంక భూమిని అక్రమంగా పొందేందుకు కుట్ర పన్నిన విలేకరులు ఇద్దరు వైసీపీ నేత బియ్యం రెడ్డి కి గతంలో ముఖ్య అనుచరులుగా ఉండడం గమనార్హం. ఈ భూ అక్రమ వ్యవహారం పై తహశీల్దార్ నర్రా జయలక్ష్మిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.




# వలపర్ల జడ్పీ హైస్కూల్‌కు ప్లాటినం జూబ్లీ వైభవం

## పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎమ్మెల్యే ఏలూరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మే 10)

మండలంలోని వలపర్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ మరియు ప్రభుత్వ విప్ పంచుమర్తి అనురాధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**పూర్వ విద్యార్థుల చొరవ అభినందనీయం....** ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులు కమిటీగా ఏర్పడి అందరి సహకారంతో ప్లాటినం జూబ్లీని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల పూనూరు జడ్పీ పాఠశాల 75 ఏళ్ల వేడుకలను కూడా పూర్వ విద్యార్థులు విజయవంతంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులను గౌరవించే సంస్కృతిని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు.

**నేను కూడా ఈ పాఠశాల విద్యార్థినే...**తాను మూడు నెలలు ఇదే పాఠశాలలో చదివానని ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన (తరువాయి 4లో...)

# ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోండి



## ఎమ్మెల్యే కందుల
## 301 మందికి కంటి పరీక్షలు
## 145 మందికి ఉచితంగా ఆపరేషన్లు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 10)

ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని, గుంటూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా "మెగా ఉచిత కంటి వైద్య శిబిరం" నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కొనసాగాలి..

# సింగపూర్ విద్యా పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 10)

గత ఏడాది అనగా 2025వ సంవత్సరానికి గాను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్, సింగపూర్‌లో వారం రోజుల పాటు సాగిన నూతన విద్యా అధ్యయన పర్యటనను ముగించుకుని శనివారం స్వదేశాగమనమయ్యారు. ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు అంతర్జాతీయ విద్యా ప్రమాణాల పై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పర్యటనను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థలో ప్రత్యేక శిక్షణ మే 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు అధ్యయన కార్యక్రమాలు సింగపూర్ విద్యా వ్యవస్థలోని అత్యాధునిక బోధనా పద్ధతులు, పాఠశాలల నిర్వహణ, సాంకేతికత వినియోగం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి వారు తీసుకుంటున్న చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఇలాంటి అంతర్జాతీయ శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. సింగపూర్‌లో తాను నేర్చుకున్న మెలకువలను, అక్కడి విద్యా విధానాలను తర్లుపాడు పాఠశాలలో అమలు చేసి, విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందిస్తానని సుధాకర్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. సుధాకర్ తిరిగిరావడంతో పాఠశాల సిబ్బంది, మిత్రబృందం, అభిమానులు, శ్రేయోభిలాషులు, విద్యార్థులు, గ్రామస్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# వలపర్ల జడ్పీ హైస్కూల్‌కు ప్లాటినం జూబ్లీ వైభవం





రోజులు ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. అనంతరం ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో సీటు రావడంతో అక్కడికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. దాదాపు 28 ఏళ్ల తర్వాత తనతో చదివిన సహచరులను కలవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

**పాఠశాలకు ఉపయోగపడే పనులు చేయాలి...**

75 ఏళ్ల వేడుకల సందర్భంగా పాఠశాలకు ఉపయోగపడే విధంగా ఒక మంచి నిర్మాణం లేదా సదుపాయం ఏర్పాటు చేసేలా మంచి ప్రతిపాదన ను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ పాఠశాల స్థాపనకు, అభివృద్ధికి పెద్దలు చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణానికి సహకరించిన స్థలదాతలు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి...**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీసేలా విద్యారంగాన్ని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 'తల్లికి వందనం', సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

**ప్రజల ఆశీస్సులతో మూడుసార్లు ఎమ్మెల్యే...**

పర్చూరు నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాల వల్లే తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని ఏలూరి పేర్కొన్నారు. కార్యక్రమం ముగిసే వరకు అక్కడే ఉండి పూర్వ విద్యార్థులతో ముచ్చటిస్తూ, బ్యాచ్‌ల వారీగా ఫోటోలు దిగుతూ వేడుకల్లో పాల్గొన్నారు.

**ఏలూరికి రుణపడి ఉంటా : ఎమ్మెల్సీ అనురాధ**

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన విజయానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలను, గ్రామాన్ని ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. పాఠశాల స్థాపనకు కృషి చేసిన స్థలదాతలను గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు.



**ఘన స్వాగతం...**

ప్లాటినం జూబ్లీ మహోత్సవానికి హాజరైన ముఖ్య అతిథులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధలకు పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కొమ్ము నృత్యం, భారతనాట్యం ప్రదర్శనలతో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు అతిథులను ఆహ్వానించారు. సాంప్రదాయ కళారూపాలతో నిర్వహించిన స్వాగత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.


**ప్రసామణి వాక్చాతుర్యానికి ప్రశంసలు...**

ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా ప్రసామణి పాల్గొన్నారు. తన చమత్కారమైన వ్యాఖ్యలు, వాక్చాతుర్యంతో సభలోని అందరినీ అలరించారు. ఆయన ప్రసంగం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చి పూర్వ విద్యార్థులు, అతిథుల ప్రశంసలు అందుకుంది.

**ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలు...**

పూర్వ విద్యార్థులంతా ఒకేచోట కలుసుకుని ఆహ్లాదకర వాతావరణంలో ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని ఎమ్మెల్సీ అనురాధ పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వధూవరులకు ఎమ్మెల్యే ఇంటూరి ఆశీర్వచనాలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 10)

ఏపీ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరు రవికుమార్ కుమారుడు కిరణ్, పుష్పలత రిసెప్షన్ విజయవాడలో ఆదివారం జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోండి





కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఆపరేషన్ సైతం ఉచితంగా అందిస్తారన్నారు. ఈ రోజే బస్సులో వారిని తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి తిరిగి రెండు రోజుల్లో బస్సులో ఇక్కడికి తీసుకు వస్తారని తెలిపారు. ఎంత మందికి అవసరమైతే అంత మందికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఈ మెగా శిబిరంలో 301 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. వారిలో 145 మందికి త్వరలోనే ఆపరేషన్ ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. తదనంతరం వారికి కళ్ళజోళ్ళు సైతం ఉచితంగా అందిస్తారన్నారు. ఈ సందర్భంగా మొదటిగా ఈ కంటి వైద్య ఉచిత శిబిరాన్ని ప్రారంభించి అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, శంకర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక స్పృహకు ప్రతిబింబాలు వేమన పద్యాలు

### టిటిడి ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి
### ఉత్సాహంతో పాల్గొన్న శ్రీగిరి చిన్మయ బాల విహార్ విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

వేమన పద్యాలు సామాజిక స్పృహకు ప్రతిబింబాలని టీటీడీ ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి పేర్కొన్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీగిరి చిన్మయ బాలవిహార్ కార్యక్రమంలో శాస్త్రి పాల్గొని వేమన పద్యాలలో సామాజిక స్పృహ ఎలా ఉందో వివరించారు. వేమన ఆటవెలది ఛందస్సులో ప్రతి ఒక్కరి జీవితానికి రాజనీతి ధర్మానికి ఉపకరించే పద్యాలను రచించాడని వెల్లడించారు. ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల భాండ శుద్ధి లేని పాకమేల చిత్తశుద్ధి లేని శివ పూజలేలరా అంటూ నేరుగా ధైర్యంగా ప్రశ్నించిన ఘనత వేమన మహా కవికి దక్కుతుందని శాస్త్రి పేర్కొన్నారు. చంపదగిన శత్రువు చేతికి చిక్కినప్పటికీ చంపకుండా మేలు చేసి పంపడమే నిజమైన రాజనీతి అని వేమన పద్యాల ద్వారా ప్రబోధించారని తెలిపారు. వేమన పద్యాలు మనలోని లోపాలను దోషాలను గుర్తించి మనల్ని మనం సంస్కరించుకునేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. వేమన శతక సాహిత్యం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.





శ్రీగిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులు కంఠస్థ పద్యాలతో శ్లోకాలతో తమ ప్రతిభను చాటి చెప్పారు. రామాయణం బొమ్మల పుస్తకంలోని చిత్రాలకు రంగులు వేయడంతో పాటు అంత్యాక్షరి పోటీలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. ఆలూరు జై శంకర్ శ్రిష్టి పద్మావతి తదితరులు నిర్వహణా సహకారం అందించారు. శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పాటు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి దేవస్థానం చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షే త్రంలో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# యుద్ధం వద్దు -శాంతి కావాలి








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

యుటిఎఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా సామ్రాజ్య వాదం యుద్ధం – భారతదేశంలో దాని ప్రభావం అనే అంశం పై స్థానిక యుటిఎఫ్ భవన్లో స్మారక ఉపన్యాసం జరిగింది. ఈ సమావేశానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రధాన ఉపన్యాసకులుగా ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ వి రాంభూపాల్ హాజరై ప్రసంగించారు. యుద్ధానికి మూలం సామ్రాజ్యవాదం, గ్లోబలైజేషన్‌లో ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం ప్రతి ఒక్కరి పై పడుతుందన్నారు. దాని పర్యవసానంగా వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ కొరతతో చాలా ఇబ్బందులు ఎదుర్కొని, పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ప్రపంచ ప్రజానీకం యుద్ధం వద్దు, శాంతి కావాలని ముందుకొస్తున్నారని అన్నారు. అమెరికా దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో సుమారు 65 లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నో కింగ్ నో వార్ అని, యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు, చర్చలు ద్వారా ప్రపంచ శాంతి అన్నిటికీ పరిష్కారం అవుతుందని చరిత్ర చెబుతున్నా, సామ్రాజ్యవాద దేశాలు దీనిని పట్టించుకోకుండా తమ ఆధిపత్య ధోరణి ప్రదర్శించటం ద్వారా చిన్న దేశాలను బలవంతంగా వారి సార్వభౌమ అధికారాలను లాక్కుని వారి ప్రజాస్వామ్య బద్దంగా ద్వారా ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలు కూలదోసి, ఆ దేశంలో అత్యధిక నిలవలు కలిగిన సహజ వనరులను, ఖనిజాలను కొల్లగొడుతున్నారన్నారు. ఈ విధమైన భావజాలాన్ని ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని ప్రపంచ శాంతి కోసం ఉపాధ్యాయులు అయినా మనం కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ స్మారక ఉపన్యాసాన్ని యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి వీరాంజనేయులు ప్రారంభిస్తూ చైతన్యంతో కూడిన కార్యకర్తలు సంఘానికి అవసరమని వీరు ద్వారా సమాజంలో సమ సమాజం నిర్మించవచ్చు. తప్పు జరిగినప్పుడు ప్రశ్నించే తత్వం ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థిని నేర్పించినప్పుడు భవిష్యత్తు సమాజం మంచి పౌర సమాజంగా నిర్మితం అవుతుందని అన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల భారత దేశంలో జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికలలో ఏర్పడ్డ ప్రభుత్వాలు ప్రజాభీష్టం మీదకు పరిపాలించాలని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజల వ్యతిరేక విధానాలు అమలు పరచకుండా వారి సంక్షేమానికి పెద్ద పీటం వెయ్యాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి లాంటి నాయకులు సంఘంలో తయారు అవ్వాలని పరిస్థితిలకు అనుగుణంగా సంఘ కార్యక్రమాలు రూపొందించి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు సంక్షేమం కొరకు పాటుపడాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్సి కమిషన్ను తక్షణమే వేయాలని పెండింగ్ డిఎలను ప్రకటించాలని, ఆర్థిక బకాయిలపై ఒక రూట్ మ్యాప్ ప్రకటించాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యున్నతమైన ఫలితాలు సాధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ యుటిఎఫ్ కార్యకర్తలు స్టూడెంట్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో పాల్గొని విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై వెంకట్రావు, ఎన్ చిన్నస్వామి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీ శేషయ్య, జిల్లా కార్యదర్శులు ఎం సంధ్యారాణి, వైఎస్ఎన్ జ్యోతి, యం మాలకొండయ్య, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణ, దుర్గ వెంకట ప్రసాద్, ఎం శ్రీను, యుటిఎఫ్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానం సమాజానికి ఆదర్శం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)



అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన కిమ్స్ యాజ మాన్యం. ఒంగోలు సమీపంలోని ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన కొమ్మూరి లక్ష్మయ్య రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడి చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. వైద్యుల నిర్ధారణ ప్రకారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అవయవదానం పై అవగాహనా కల్పించగా లక్ష్మయ్య అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో ఆసుపత్రి వైద్యులు జీవన్ దాన్‌కు దరఖాస్తు చేయగా వారు తగిన ఏర్పాట్లు చేశారు. మృతుడి భార్య కొమ్మూరి నాగదేవి మరియు కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ మానవతా నిర్ణయం ద్వారా పలువురు రోగులకు పునర్జీవం లభించే అవకాశం కలిగింది. దానం చేసిన అవయవాలలో ముఖ్యంగా మూత్రపిండాలు, కాలేయం, ఇతర అవయవాలను అవసరమైన రోగులకు విజయవంతంగా మార్పిడి చేయడానికి వైద్య బృందం సమన్వయంతో చర్యలు చేపట్టింది. ప్రకాశం జిల్లా లో కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలు నందు ఇది తొలి అవయవ దానం ఘటన కావడం విశేషం. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ డిప్యూటీ మెడికల్ డైరెక్టర్ డా. కె.అజయ్ కృష్ణ మాట్లాడుతూ అవయవ దానం అనేది అత్యున్నతమైన మానవతా సేవగా పేర్కొంటూ ప్రతి ఒక్కరూ అవగాహన చెందాలని కోరారు. ఎమర్జెన్సీ ఫిజీషియన్ డా. బాల మురళి కృష్ణ మాట్లాడుతూ బ్రెయిన్ డెత్ తర్వాత అవయవదానం ద్వారా అనేక మందికి కొత్త జీవితం అందించవచ్చని వివరించారు. అలాగే ఆసుపత్రి వైద్య బృందం సమన్వయంతో అన్ని వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిమ్స్ డైరెక్టర్ బొల్లినేని ఆద్విక్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కాకునూరి అంకి రెడ్డి, రీజినల్ సిఇఓ డాక్టర్ వి ప్రవీణ్ కుమార్, వైద్యుల బృందం మృతుడి కుటుంబ సభ్యులకు గాఢ సంతాపం తెలియజేసి, వారి ఈ గొప్ప నిర్ణయాన్ని అభినందించారు. ఈ ఘటన అవయవదానం ప్రాముఖ్యతను మరోసారి చాటి చెబుతూ, సమాజానికి ఆదర్శంగా నిలిచింది అన్నారు.







# శ్రీ హరి హర క్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, మే 10)



ఈ నెల 12 వ తేది మంగళవారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు హరిహర క్షేత్రం ఆలయ వ్యవస్థాపక ధర్మ కర్తలు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం క్షేత్రంలో నెలకొని వున్న ప్రసన్న ఆంజనేయస్వామి వారికి విశేష పూజలు, అభిషేకం, హోమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులు తెలిపారు. ఆలయ అర్చకులు, ఉభయ దాతలు, భక్తులు హోరుత్వికుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యహవచనం, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, మన్య సోక్తహోమం, శ్రీ ఆంజనేయ స్వామి వారి మూల మంత్ర హోమం, నవ గ్రహ హోమం, మహా పూర్ణాహుతి భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, ఆర్యవైశ్య మహిళ భక్తుల నిర్వహణలో 108 కలశాలతో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి గంగా జలం, పంచామృత, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు అంతే కాకుండా స్వామి వారికి లక్షనాగ వల్లి దళార్చన వైభవంగా నిర్వహిస్తున్నట్లు శిద్దా రాఘవరావు వెల్లడించారు. తదుపరి మంగళవారం రాత్రి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి శ్రీ హరిహర క్షేత్రం నుండి చీమకుర్తి పుర వీధుల్లో స్వామి వారి నగరోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగే శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి హనుమజ్జయంతి వేడుకలకు హాజరై స్వామి వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి కరుణాకటాక్షాలు పొందాలని శిద్దా రాఘవరావు భక్తులకు విజ్ఞప్తి చేసారు. నగరోత్సవంలో పాల్గొను భక్తులు, బాలికలు, అభిషేకం నిమిత్తం కలశ సేవలో పాల్గొను భక్తులు ఒక రోజు ముందుగా అనగా సోమవారం సాయంత్రంలోపు శ్రీ హరిహరక్షేత్రంలో తమ గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని ఆలయ అర్చకులు శ్రీ కృష్ణ స్వామి కోరారు.

# పెళ్లి కుమార్తెను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 10)**

కందుకూరు నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. వలేటివారిపాలెం మండలం పోలినేనిచెరువు పంచాయతీలోని వీరన్నపాలెం గ్రామంలో వల్లెం మల్లికార్జునరెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమార్తె మానస వివాహం సందర్భంగా వారి ఇంటి వద్ద నలుగు కార్యక్రమానికి హాజరై పెండ్లి కుమార్తెను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, క్లస్టర్ ఇంచార్జ్ కాకుమాని హర్ష, పార్టీ నాయకులు పెగడ శ్రీనివాసులు, మోహన్, శనివారపు మాల్యాద్రి రెడ్డి, లింగాలదిన్నె వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కందుకూరు మండలం ఓగూరు గ్రామంలో చల్లా వెంకట్రావు, సుజాత దంపతుల కుమారుడు సాయికృష్ణ – హర్షిత వివాహ వేడుకకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పచ్చవ తిరుపతిస్వామి, రాయపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పురుషోత్తం సేవలు చిరస్మరణీయం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 10)**

యేరువారిపల్లి పంచాయతీలోని అజీస్‌పురం గ్రామంలో జరిగిన కామ్రేడ్ పురుషోత్తం 137 వ వర్ధంతి సందర్భంగా శాఖ కార్యదర్శి పటాన్ నాయబ్ రసూల్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సిపిఐ పార్టి జిల్లా కార్యవర్గ సభ్యులు వై రవీంద్రబాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీచర్ గా సర్పంచ్‌గా గ్రామ ప్రజల హృదయాలలో నేటికి చిరస్థాయిగా నిలిచి పోయిన నాయకుడు కామ్రేడ్ పురుషోత్తం అన్నారు. గుజ్జుల యలమందారెడ్డి స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టి లో కామ్రేడ్ యేరువ మహానందారెడ్డి వై పురుషోత్తం కోమటిగుంట భీమయ్య చురుగ్గా పనిచేసి సంఘాలు పెట్టి భూపోరాటాలు చేసి భూమిలేని పేదవారికి భూమి పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టిదే అన్నారు. బలమైన వ్యవసాయకార్మిక సంఘం, యువజన సంఘాలు పెట్టి అన్ని చిన్న కులాల వారిని ఏకం చేసి పోరాటలు జరిపిన నాయకుడు కామ్రేడ్ పురుషోత్తం ఉపాధ్యాయులను ఎస్ టియు సంఘంలో చేర్పించి జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారన్నారు. బిజెపి నాయకులు మతంతో మనుషులను విడదీస్తూ మసీదులు, చర్చీలు కూల్చుతూ ఘర్షణలకు అద్యం పోస్తూ దళితుల పై దాడులు, మహిళల పై మానభంగాలు, గిరిజనుల పొట్టగొట్టి నక్సలైట్ పేరుతో ఎంతో మందిని చంపి వారి భూమి హక్కులను హరింప చేసి వారికి ఇల్లు వాకిలి లేకుండా చేసిన సంఘటనలు చూసామన్నారు. మహిళలను బట్టలు ఊడదీసి నడి వీధులలో తిప్పిన ఎన్నో సంఘటనలు చూసామన్నారు. వీటిని ఎదుర్కొనుటకు పేద బడుగువర్గాలు, దళిత గిరిజన ముస్లిం క్రైస్తవ మైనార్టీ సమాయత్తం కావలన్నారు. సిపిఐ కనిగిరి మండల కార్యదర్శి జిపి రామారావు మాట్లాడుతూ కామ్రేడ్ పురుషోత్తం పేద కులాల వారికి అజీస్‌పురంలో కుటుంబానికి 5 సెంట్లు భూమి ఇచ్చి, కాలనీ ఏర్పాటు చేసి పంచాయతీని ఎంతో ఆదర్శంగా నడిపించిన మేధావి అన్నారు. ఎన్నో ప్రజా సమస్యలను పరిష్కరించిన నాయకుడని ఆయన సేవలు మరువలేవన్నారు. దళిత హక్కుల పోరాట సమితి మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ మాట్లాడుతూ రాబోయే కాలం చాల కష్టకాలమని బాబా సాహెబ్ అంబేద్కర్ భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య దేశమని రాజ్యాంగంలో పొందుపరిస్తే బిజెపి వాటిని తుంగలో తొక్కి హిందూ దేశంగా మార్చి మతాలు, కులాలతో ఘర్షణలు సృష్టించడం బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాల ప్రజలను రిజర్వేషన్లు రద్దు చేసి వారికి చదువు, ఉద్యోగాలకు దూరం చేయాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం యేరువారిపల్లె సిపిఐ శాఖ కార్యదర్శి ఉస్తేల వెలుగొండయ్య, అంకమ్మ, జి తిరుపాలు, వై ప్రభాకర్, జే బాలకోటయ్య, మాలకొండయ్య, షేక్ మహ్మద్, వెంకట కొండయ్య, వెలుతుర్ల ఖాసీం పీరా, కే తిరుపాలు, ప్రసాద్, నాగేశ్వరరావు, ఆచారి, రమణయ్య, సుబ్బారావు, పవన్, తాహీద్‌లు జోహార్లు తెలిపారు.



# రాజసానికి, పౌరుషానికి మారుపేరు ఒంగోలు గిత్తలు

**ఎడ్ల పోటీల ద్వారా ఒంగోలు జాతి పశు సంపదను, రైతులను ప్రోత్సహించడం అభినందనీయం**

**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, మే 10)**

రాజసానికి, పౌరుషానికి మారుపేరుగా నిలిచి భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిచెప్పిన ఒంగోలు జాతి గిత్తలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం మద్దిపాడు మండలం దొడ్డవరం (తెల్లపాడు)లో జరిగిన జాతీయస్థాయి ఒంగోలు జాతి బల ప్రదర్శన ఎడ్ల పోటీలకు మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన ప్రాంతంలో పుట్టిన ఒంగోలు జాతి గిత్తలు మనదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మేలు జాతిగా గుర్తింపు పొంది మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందన్నారు. ఒంగోలు జాతి జాతీయస్థాయి ఎడ్ల పోటీలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. బల ప్రదర్శనలను నిర్వహించడం ద్వారా ఒంగోలు జాతి పశువులను పశుపోషకులు ఉత్సాహంగా పశుసంపదను పెంచుతారన్నారు. పశువులు ప్రతి రైతు జీవితంలో ఒక భాగం అన్నారు. ఇది కేవలం బల ప్రదర్శన కాదని ఒంగోలు జాతి పశు సంపదకు, రైతులకు ప్రోత్సాహకమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు సంతనూతలపాడు, కనిగిరి ఎమ్మెల్యేలు బి.ఎన్ విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మద్దిపాడు మండల నాయకులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు మదనపల్లి శ్రీనివాసరావు పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్), పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.
















# కాకర్ల జడ్పీహెచ్ హై స్కూల్ పదవ తరగతి ఫలితాలను గురించి ఇంటింటా ప్రచారం








**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, మే 10)**

మండలంలోని కాకర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఈ సంవత్సరం వచ్చిన పదవ తరగతి ఫలితాల వివరాలను కరపత్రాలు ముద్రించి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించమని, ప్రభుత్వం విద్యార్థులు కు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ సుబ్రహ్మణ్యం, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. శివరాయనిపేట, పన్నూరు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకర్ల 2009 –2010 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి గురువులు ఆహ్వానించి పూలమాలతో సత్కరించారు.

# నేటి నుండి వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

## హనుమత్ జయంతికి చలువ పందిర్లు, విద్యుత్ దీపాలతో ముస్తాబైన ఆంజనేయస్వామి దేవాలయం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 10)

బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్ సుమిత్రానగర్ లో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు నేటి నుండి రెండు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ మరియు పలువురు కమిటీ సభ్యులు ఆలయ పండితులు వీరేశచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమజ్జయంతి వేడుకలను సుమిత్రానగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో పలువురు దాతల సహాయ సహకారాలతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం సాయంత్రం ఆంజనేయ స్వామికి వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో కనుల పండగగా స్వామివారికి పంచామృత అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. కావున భక్తాదులందరూ విరి విరిగా పాల్గొని స్వామివారి అభిషేకాన్ని స్వీకరించగలరని తెలిపారు, అలాగే మంగళవారం ఉదయం హనుమజ్జయంతి వేడుకలలో భాగంగా స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ కలదు అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. సాయంత్రం నాలుగు గంటల నుండి స్వామివారి గ్రామోత్సవం కార్యక్రమాన్ని పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కనుల పండగగా నిర్వహించడం జరుగుతుంది. కావున భక్తాదులందరూ విరివిరిగా పాల్గొని హనుమజ్జయంతి వేడుకలను జయప్రదం చేయాలని పలువురికి కమిటీ సభ్యులు తెలియజేయడమైనది.

**హనుమత్ జయంతి వేడుకల్లో విరివిరిగా భక్తులు పాల్గొనాలి**
**వీరేశచార్యులు, ఆలయ పూజారి, బద్వేల్**

నేటి నుండి జరుగుతున్న హనుమాన్ జయంతి వేడుకల్లో బద్వేల్ పట్టణ పరిసర ప్రాంత ప్రజలందరూ పాల్గొని స్వామివారి అభిషేకం మరియు హనుమాన్ జయంతి వేడుకలను కనుల పండగగా నిర్వహించేందుకు భక్తాదులందరూ విరివిరిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.

**దాతల సహకారం మరువలేనిది**
**ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ**

బద్వేల్ పట్టణంలోని సిద్దవటంలో సుమిత్రానగర్‌లో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో నేటి నుండి రెండు రోజులు పాటు జరుగుతున్న హనుమజ్జయంతి వేడుకలలో భక్తాదులందరూ విరి విరిగా పాల్గొని హనుమాన్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి. హనుమాన్ జయంతి వేడుకలకు సహకరించిన దాతల సేవలు మరువలేనివని ఆలయ నిర్వాహకులు వెంకటరమణ పలువురు దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జరగబోవు హనుమజ్జయంతి వేడుకలలో భక్తాదులందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు. ఇవే మా ఆహ్వానంగా భావించి జరగబోయే జయంతి వేడుకలను వైభవంగా జరిగే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి స్వామి జయంతి వేడుకలకు అవసరమైన చలువ పందిర్లు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తూ భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు ఏర్పాటు చేయడం జరిగింది. హనుమాన్ జయంతి వేడుకలకు సహకరించిన భక్తాదులందరకు పేరుపేరునా వెంకట రమణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.







## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు

### పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి పోలీసులు అదుపులో 9 మంది



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు బృందాలు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ భీమ నాయక్ ఆధ్వర్యంలో ఎస్ ఐ చెంచయ్య, ఏఎస్ఐ మహబూబ్ బాషా, సిబ్బంది కలిసి తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరుకుంపాలెం గ్రామ సమీపంలో కోత ముక్క పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.4,030 నగదు స్వాధీనం చేసుకున్నారు.

జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

## కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు

### ముగిసిన రాష్ట్ర మహాసభలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

ఆర్థిక వ్యవస్థ నమ్మకాన్ని కలిగిస్తూ డిపాజిట్ సేకరణతో పాటుగా ఎన్‌పిఏల పై దృష్టి సారిస్తే తక్కువ వడ్డీకి రైతులకు రుణాలు అందించే అవకాశం ఉంటుంది అని ఆ దిశగా ఉద్యోగులు అడుగులు వేయాలని విజయనగరం డిసిసిబి బ్యాంక్ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. నగరంలోని సాయి ఐటిఏ కన్వెన్షన్ హాల్లో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర 14వమహాసభకు రెండవ రోజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా బ్యాంకు అభివృద్ధి చెందాలంటే ఉద్యోగులు ఎంతో కీలకమని నూతన అధ్యయనానికి తెరదీసి కొన్ని కొన్ని సూచనలు సలహాలతో కొత్తరకంగా రైతులు ముందుకు వెళితే కచ్చితంగా లాభాలు వస్తాయని గుర్తు చేశారు. విజయనగరం జిల్లాలో సరికొత్త మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. డిసిసిబిలకు ఒక రాజకీయ కోణాన్ని అంటగడతారని అందువల్ల కొందరు రుణాలు తీసుకొని ఎన్ పి ఏ లకు వెళుతున్నారని ఎవరు లోను తీసుకున్న కచ్చితంగా కట్టించాలని విజయనగరం జిల్లాలో మొండి బకాయిలను వసూలు చేసిన ఘనత ఉందని అన్నారు. గత పాలకులు తీసుకొన్న నిర్ణయాలు కారణంగా రాష్ట్రంలోని అన్ని బ్యాంకులు నష్టాల బాటలో ఉన్నాయని వాటిని మళ్లీ ఆర్థిక పరిపుష్టి చేసి ముందుకు తీసుకు వెళ్తున్నామని ఉద్యోగులు కూడా బ్యాంకు లాభాల బాటలో నడిచేందుకు రైతులకి రుణాలు అందిస్తూ, రైతుల వద్ద నుంచి వసూలు చేయిస్తూ పరస్పర సహకారం అందించుకున్నప్పుడు బ్యాంకుల అభివృద్ధి పథంలో నడుస్తాయని అందుకు ఉద్యోగస్తులు పూర్తి సహాయ సహకారాలు అందించి రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సహకార రంగం ఎప్పుడైతే బలోపేతంగా ఉంటుందో అప్పుడే నాబార్డ్ లాంటి వాళ్లు కూడా మన దగ్గర సూచనలు సలహాలు తీసుకుంటారని గుర్తు చేశారు. మహాసభల ఆహ్వాన కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, ఏఐబీఏ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ రాంబాబు, చలసాని మాధవరావు, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, నారాయణరెడ్డి, గౌతమ్, తదితరులు ఉన్నారు.









## భారత రామాయణాల గురించి అవగాహన





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 10)**

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివి ంచి, భారత రామాయణాల గురించి అవగాహన కలిగించడం జరిగింది. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా రేపు క్విజ్ పోటీలు జరుగు తాయని విద్యార్థులకు ముందుగా చెప్పడం జరిగినది. ఈ కార్యక్ర మానికి హాజరైన విద్యార్థులకు గ్రంథాలయ భవన దాత శ్రీమతి కోటిరెడ్డి సుచరితారెడ్డి స్వర్గీయ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి పేరు మీద విద్యార్థులకు స్నాక్స్ అందించి పిల్లల ప్రేమకు పాత్రులైనారు. వారికి గ్రంథ పాలకుడు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి 30 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 10)**

మండలంలోని చిన్నగంజాం ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న 106 పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా వాట్సాప్, సోషల్ మీడియా సాయంతో ఒకచోట చేరి, పాత రోజులను నెమరు వేసుకుంటూ బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షే మాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణలో మళ్ళీ చిన్నపిల్లలై ఆడుకుంటూ, ఒకరి కొకరు ఆప్యాయంగా పలకరించుకోవడం, చిన్ననాటి తుంటరి పనులను గుర్తుచేసుకుంటు, జీవిత అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు ఘనంగా సత్కరించి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో 2001-02లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కనిగిరి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 10)**

కనిగిరి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా సయ్యద్ షఫీ (టీవీ 9), ప్రధాన కార్యదర్శిగా గోపవరపు సత్యంరెడ్డి (షణ్ముఖ వెలుగు ఇన్‌ఛార్జి), గౌరవ అధ్యక్షు లు ధూళిపాళ్ల మల్లికార్జునరావు (న్యూస్ 99) గౌరవ సలహా దారులు నూతలపాటి లక్ష్మణాచారి (యుటీవీ), పందిటి జోయల్ రాజు (షణ్ముఖ వెలుగు), రాచపూడి స్వర్ణ బాబు (ఐ లోకల్ న్యూస్), ఉపాధ్యక్షులు వంగలపూడి రంగారావు (మెట్రో ఉదయ ం), గోన దానయ్య (స్వాతంత్ర న్యూస్) వేమ నరసింహారావు (ఆర్టీవీ), సహాయ కార్యదర్శులు సురబోయిన గురవయ్య (హెచ్ఎంటీవీ), నేలపాటి రవి (క్రౌన్ హ్యూమన్ రైట్ దినపత్రిక), మీసాల రమేష్ (సాక్షి టివి), నరాల రామాంజనేయరెడ్డి (సీవీఆర్‌న్యూస్), ట్రెజరర్ చెక్క బసవేశ్వరరావు (కాకతీయ), కార్యవర్గ సభ్యులుగా ఆంద్రా మనోహర్ (పల్నాటి సాక్షి), తోకల తిరుపతిరావు (ఎన్ టైమ్స్), చీకటి వెంకటసుబ్బయ్య (టుడే మాచర్ల), జి ప్రసాదరావు (ప్రజా మార్పు), బత్తుల సునీల్ (డి న్యూస్), బలసాని యెహోషువ (ప్రాంతీయ వార్త), జి ప్రసాద్‌రావు (ప్రజా మార్పు దినపత్రిక), ముప్పూరి ఏడుకొండలు (పెన్నా తీరం), పరిసపోగు నవకుమార్ (సువర్ణ సాగరం), గుడిపాటి వీరనారాయణ (న్యాయం దినపత్రిక) లు ఎన్నికయ్యారు.

# ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరు పతాకం పివి రావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)**

మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి రావు 74 జయంతి కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు నీలం నాగేంద్రరావు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరు పతాకం పివి రావు అని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ధారా అంజయ్య అన్నారు. ముందుగా ఆయనకు నివాళులర్పించారు. ఆదివారం స్థానిక నీలం పాలెం వద్ద దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర రావు ఆధ్వర్యంలో 74 వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు అధ్యక్షులు ధారా అంజయ్య మాట్లాడుతూ దళితులుగా కొనసాగుతున్న మాల మాదిగల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు చిచ్చు పెట్టి ఎస్సీ వర్గీకరణను తెరమీదకు తెచ్చారన్నారు. తెలంగాణ నుంచి వచ్చిన మందకృష్ణచే ఎస్సీ వర్గీకరణ చంద్రబాబు ప్రాయోజిత పోరాటాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ ప్రవేశించిన 1994 లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణ మాదిగచే ఎంఆర్‌పిఎస్ ఉద్యమాన్ని ప్రారంభింప చేశారన్నారు. అగ్రకుల రాజకీయ పార్టీల ఆర్థిక సహకారంతో మాలలకు వ్యతిరేకంగా సమాజంలోని అన్ని కులాలు ఎంఆర్‌పిఎస్‌కు శక్తి వంచన లేకుండా సహకరించారన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార పత్రిక సంపాదకుడిగా ఉన్న గ్రూప్ వన్ అధికారి అయిన గోదావరి జిల్లాకు చెందిన పోతుల విగ్నేశ్వర రావు మాల మహానాడు ఉద్యమానికి సారాజ్యం ఊహించారన్నారు. రాష్ట్రమంతా తిరిగి మాలలను ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరులో భాగస్వాములను చేశాడు ఈ క్రమంలో 1997 వ సంవత్సరంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ చంద్రబాబు మాల మాదిగల మధ్య మంట పెట్టిన మనువాద కుట్రను వ్యతిరేకిస్తూ హైదరాబాదు చలో సెక్రటేరియట్ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు నాయుడు ఫాసిస్టుగా మారి మాలలపై మాలలను గుర్రాలతో తొక్కించి లాఠీ ఛార్జ్ చేయించి మన జిల్లాకు చెందిన గోప తోటి నారాయణ పానుగంటి శేషయ్య ల చావుకు చంద్రబాబు కారణమయ్యాడు అన్నారు. అలాగే వందలాదిమంది మాలల రక్తం రుచి చూసి చరిత్రలో మాలల వ్యతిరేకిగా మిగిలిపోయాడన్నారు. తరువాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గ్రూప్ వన్ అధికారి అయిన పివి రావు పై ఉద్యోగం నుంచి తొలగించాడన్నారు. అంతటితో ఆగక పివి రావు నివసిస్తున్న గవర్నమెంట్ క్వార్టర్ను కూడా అక్రమంగా ఖాళీ చేయించి పివి రావు కుటుంబాన్ని నడిరోడ్డుపై నెట్టాడన్నారు. గ్రూప్ వన్ అధికారి అయిన పీవీ రావు మాల కోసం తనకున్న ఉద్యోగాన్ని కూడా ప్రభుత్వ గూడును కూడా వదులుకొని నిరాశ్రయుడు అయినాడు అన్నారు. ఈ క్రమంలో పివి రావు వర్గీకరణకు వ్యతిరేకంగా మరల రాష్ట్రమంతా తిరిగి మాల జాతి మనుగడ కోసం చంద్రబాబు మాల వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారన్నారు. తరువాత వర్గీకరణను హైకోర్టు కొట్టు వేసిన ప్రభుత్వం ఉష మెహర కమిషన్ వేయడంతో తన వాదనలు వినిపించడానికి మాల జాతి తరపున ఢిల్లీ వెళ్లి వెళ్లిన పివి రావు ఢిల్లీలోనే ఆకస్మికంగా మరణించాడు అన్నారు.

కానీ తరువాత మాల మహానాడు పేరుతో అనేకమంది నాయకులు ఎటువంటి పోరాటాలు చేయకుండానే ప్రభుత్వంలో ఎమ్మెల్సీ, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ కమిషన్ పదవులు పొందేరే కానీ మాల జాతికి వారు చేసిందేమీ లేదన్నారు. మోడీ ప్రభుత్వం మందకృష్ణతో కుమ్మక్కై సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇప్పిచ్చిన మాలల కోసం ఏ రోజు ధర్నా కూడా చేయని జూపూడి ప్రభాకర్ రావు లాంటివారు కనీసం సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా వేయలేదన్నారు. కావున మాల జాతి కోసం తన ఉద్యోగాన్ని వదిలి కుటుంబాన్ని నడిరోడ్డుపై వేసుకొని గ్రూప్ వన్ ఉద్యోగాన్ని పోగొట్టుకొని చిన్న వయసులోనే ఆకస్మికంగా ఢిల్లీలో మరణించిన అమరుడు మాల జాతి ధ్రువతార పివి రావు అనే మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి మాల పరిరక్షణ సమితి కన్వీనర్ దేవరపల్లి గోపి, స్థానిక అంబేద్కర్ సంఘ నాయకులు వేలూరి శ్రీనివాసరావు గడ్డం నరసయ్య చినిగి చుక్కోడ్ బాలస్వామి తదితరులున్నారు

# ఎడ్లపందేల విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, బిఎన్ విజయ్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 10)**


మండలంలోని తెల్లబాడు, దొడ్డవరం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శనలో మూడవరోజు శనివారం రాత్రి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ ఆహ్వానం మేరకు ఆయనతో కలిసి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో రైతులు ఎడ్లను కుటుంబ సభ్యుల్లాగా చూసుకునే వారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్లకు గుర్తింపు ఉందని, ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, ఒడా చైర్మన్ షేక్ రియాజ్ , జనసేన నాయకులు కంది రవి శంకర్, గొల్లపూడి వీరేంద్ర చౌదరి, రాష్ట్ర పొగాకు బోర్డు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, గొట్టిపాటి రాఘవరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







# దంపతులను ఆశీర్వదించిన మాజీ మంత్రి మానుగుంట



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 10)**

ఉలవపాడు మండలం అలగాయపాలెం గ్రామంలో తెడ్డు వెంకటేశ్వర్లురెడ్డి, యానాదమ్మల కుమారుడు తెడ్డు భాస్కర్‌రెడ్డి వివాహానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నవ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆయన అభిమానులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com